సాక్షి
కుమురం భీం
సోమవారం, 12, ఫిబ్రవరి, 2024

ఘనంగా పెర్సపేన్ పూజలు

కేస్లాపూర్ జాతరలో భాగంగా మెస్రం వంశీయులు ఆదివారం పెర్సపేన్, భాన్ దేవతల పూజలు ఘనంగా నిర్వహించారు. మరోవైపు భక్తులు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు.

- వివరాలు 8లో



న్యూస్‌రీల్

నేడు విద్యాసంస్థలకు సెలవు

ఆసిఫాబాద్: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతరను పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ హేమంత్ బోర్కడే ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా మార్చి 9(రెండో శనివారం) విద్యా సంస్థలు పని చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లాలో ఎంపీడీవోల బదిలీ

ఆసిఫాబాద్: త్వరలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలో పలువురు ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ ఎంప్లాయిమెంట్ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎంపీడీవోలు సత్యనారాయణసింగ్, పి.శ్రీనివాస్, జి.సత్యనారాయణ, యు.మధుసూదన్, ఆర్.మహేందర్, నూటెంకి రాజేశ్వర్, శశికళ, జేఆర్ ప్రసాద్‌ను మంచిర్యాల జిల్లాకు బదిలీ చేశారు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఎంపీడీవోలు వి.ప్రవీణ్‌కుమార్, వీవీ వరలక్ష్మి, ఎస్.శంకరమ్మ, వేముల మల్లేశ్, టి.శ్రీనివాస్, పి.సత్యనారాయణ, డి.రాజేందర్‌ను కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేశారు.

16న టీఎస్ యూటీఎఫ్ జిల్లాస్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఇందురావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్టు సమీపంలోని ఎస్‌ఎం గార్డెన్‌లో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ముఖ్య అతిథిగా డీఈవో పార్శి అశోక్, డీటీడీవో రమాదేవి గౌరవ అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ సవాళ్లు- పరిష్కారం దిశగా చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలు, వాటి పరిష్కారం, పోరాటాలు, సంఘ నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎల్లయ్య, హేమంత్ షిండే, రమేశ్, ఊషన్న, నవీన్‌కుమార్, బాదిరావు, జాడి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీజీ సెట్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్సీవో

ఆసిఫాబాద్: గురుకులాల్లో 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన 5వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 85 శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఆసిఫాబాద్, రెబ్బెన, సిర్పూర్-టి, కాగజ్‌నగర్‌లో మొత్తం 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2,782 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 2,367మంది హాజరయ్యారు. 415 మంది గైర్హాజరయ్యారు. ఆసిఫాబాద్‌లోని పరీక్ష కేంద్రాలను గురుకుల ఆర్సీవో స్వరూపారాణి పర్యవేక్షించారు.

నాణ్యతకు పాతర!



ఇది వాంకిడి మండలం ఎనోలి కొలాం గూడ గ్రామంలో నిర్మించిన నివాస గృహం. గతేడాది ఆగస్టులో నిర్మాణం ప్రారంభించారు. సదరు గుత్తేదారు చకచక పనులు పూర్తిచేసి ఇంటికి రంగులు వేయడంతో లబ్ధిదారు వెంటనే గృహప్రవేశం చేసి ఇందులోనే జీవనం సాగిస్తున్నాడు. ఈ ఇంటి వెనుక భాగంలో ఒక కిటికీ, ఒక తలుపు ఉండగా వర్షపు నీరు లోపలికి రాకుండా ఇనుప రాడ్లు, సిమెంటుతో సజ్జ నిర్మించారు. కొన్ని నెలలకే అవి పడిపోయే స్థితికి చేరాయి. ఇంట్లో చిన్న పిల్లలు ఉండటంతో ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.



ఇది తిర్యాణి మండలం బుగ్గరామన్న గూడెంలో చేపడుతున్న ఇంటి నిర్మాణం. నిబంధనల ప్రకారం బేస్‌మెంట్ తవ్వి దానిపై ఐరన్‌తో బెడ్ పోయాల్సి ఉంటుంది. సంబంధిత కాంట్రాక్టర్ అవి ఏమీ పట్టించుకోకుండా నేలపైనే ఐరన్ రాడ్ ఉంచి వాటిపై బెడ్ వేశాడు. దీని ద్వారా గోడలకు పగుళ్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆరు ఐరన్ బార్‌లతో నిర్మించాల్సిన పిల్లర్లను కేవలం నాలుగు బార్‌లు మాత్రమే వేస్తున్నాడు. అంతేకాక సమీప వాగుల్లోని నాసికరమైన ఇసుకను ఇంటి నిర్మాణాలకు వినియోగిస్తున్నాడు. మండల వ్యాప్తంగా నిర్మిస్తున్న 52 గృహాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.



వాంకిడి మండలంలోని పైకి లేచిన ఇంటి రేకులు

- పీవీటీజీలకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక గృహాలు
- రూ.2.50 లక్షలు వెచ్చించినా అధ్వాన నిర్మాణాలు
- నెలలకే పగుళ్లు తేలుతున్న గోడలు, దిమ్మెలు
- నిబంధనలు పాటించని గుత్తేదారులు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు

వాంకిడి/తిర్యాణి: ఆదివాసీల అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో అర్హులకు అందడం లేదు. ఆదివాసీల్లో అత్యంత వెనుకబడిన కొలాం గిరిజనుల జీవితాలు నేటికీ చీకట్లోనే మగ్గుతున్నాయి. పూరి గుడిసెల్లో కాలం వెల్లదీస్తున్నారు. పీవీటీజీలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలనే సంకల్పంతో గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దశలవారీగా పిల్లర్లతో కూడిన ఇంటి నిర్మాణాలు చేపడుతోంది. సంకల్పం గొప్పదే అయినా గుత్తేదార్లు చేతివాటం ప్రదర్శించడం, సంబంధిత అధికారులు 'మామూలు'గా తీసుకోవడంతో ఇళ్లు నాలుగు నెలలైనా నిలబడలేని పరిస్థితి కనిపిస్తోంది. రూ.కోట్లాది ఐటీడీఏ నిధులు వృథా కావడంతోపాటు ఆదివాసీల ఆశలు నీరుగారిపోతున్నాయి.

నిర్మాణం ఇలా..

ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని కెరమెరి, ఆసిఫాబాద్, తిర్యాణి, వాంకిడి మండలాల్లో కొలాం గిరిజనులకు మొత్తం 238 గృహాలు మంజూరయ్యాయి. కాగా ఒక్కో ఇంటి నిర్మాణాన్ని రూ.2.50 లక్షలు కేటాయించారు. 15.9/10 ఫీట్ల కొలతలతో నాలుగు పిల్లర్లు ఏర్పాటు చేయాలి. ఇనుప పైపులు, రేకులతో ఇంటి పైకప్పు.. ఇంటికి ముందు 15.9/7 ఫీట్ల రేకుల పందిరి, ఇంటికి ఆనుకుని 5/4 ఫీట్ల కొలతలతో బాత్‌రూం నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. లబ్ధిదారులు డబ్బులు కలుపుకుని గుత్తేదారుతో మాట్లాడుకుని ఇంటి నిర్మాణాన్ని పెంచుకునే వెసులుబాటు కల్పించారు. కొంతమంది నగదు జమ చేసుకుని పిల్లర్లు పెంచుకోవడం, ఇంటిపై రేకులు కాకుండా స్లాబు వేసుకుంటున్నారు. డబ్బులు లేని పేదలు మాత్రం రూ.2.50 లక్షలతోనే ఇళ్లు పూర్తి చేసుకుంటున్నారు. గతంలో ఐటీడీఏ నుంచి రెడీమేడ్ ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. కాగా గతేడాది ఆదివాసీ సంఘాల నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి పిల్లర్లతో కూడిన ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

కూలీల భారం లబ్ధిదారులపైనే..

కాంట్రాక్టర్లు మేస్త్రీలను మాత్రమే గ్రామాలకు తీసుకువెళ్లి లబ్ధిదారులతో పనులు చేయిస్తున్నారు. లబ్ధిదారులే ఒక్కో ఇంటి నిర్మాణానికి నలుగురు, ఐదుగురు మనుషులను సొంతంగా పనికి పిలుస్తున్నారు. రేకుల తలుపులు ఏర్పాటు చేసేందుకు అదనంగా రూ.1200 వసూలు చేస్తున్నారని, ఇంటి పైకప్పు కోసం ఇనుప పైపులు లేదా కర్రను సిద్ధం చేసుకోవాలని గుత్తేదార్లు చెబుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

నిర్మాణాలు నిలిచేనా..

ప్రస్తుతం ఉన్న ఇళ్లను తొలగించి ఐటీడీఏ నుంచి మంజూరైన గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు భయం గుప్పిట్లో గడుపుతున్నారు. ఇంటిపై ఏర్పాటు చేసిన రేకులకు రంధ్రాలు, రేకుల మధ్య ఖాళీ స్థలం వదిలేయడంతో వర్షం కురిస్తే పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఐటీడీఏ డీఈ నిరంజన్‌రావును వివరణ కోరగా.. జిల్లాలో ఎక్కడా నాసిరకంగా పనులు జరగలేదని తెలిపారు. ఒకవేళ అలా జరిగి ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇది పరిస్థితి..

గతేడాది నుంచి ప్రారంభమైన ఇంటి నిర్మాణాలు కొన్ని గ్రామాల్లో పూర్తి కాగా.. మరికొన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. కొలాం గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సదరు గుత్తేదార్లు అందిన కాడికి దోచుకుంటున్నారని, దీనికి సంబంధిత అధికారులు సైతం సహకరిస్తూ 'మామూలు'గా తీసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇంటి పైకప్పు, ముందు పందిరి నిర్మాణానికి 40 ఎంఎం ఇనుప పైపులు, పల్చటి రేకులు వాడుతున్నారు. ఇవి చిన్నపాటి గాలులకే ఊగుతున్నాయి. వేసవిలో వీచే బలమైన ఈదురు గాలులకు ఏ మాత్రం నిలబడతాయనేది అనుమానంగా మారింది. రేకులు లేచిపోకుండా పైన నిర్మించిన సిమెంటు దిమ్మెలు ఇప్పటికే కూలిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే బాత్‌రూంలపై పైకప్పులు కూడా వేయలేదు. ఇంకొన్ని చోట్ల అయితే అసలు బాత్‌రూంలే నిర్మించకపోవడం గమనార్హం. ఇదేంటని ప్రశ్నించిన వారిని హేళన చేస్తూ మీకు వచ్చిన డబ్బులో ఇంతే పని జరుగుతుందని దురుసుగా మాట్లాడుతున్నారని పేదలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

భయంగా ఉంది



చిన్నపాటి గాలులకే పందిరి, ఇంటి పైకప్పు కదులుతుంది. ఎప్పుడు కూలిపోతుందోనని భయమేస్తుంది. రేకులు సైతం సరిగ్గా అమర్చకుండానే బిగించారు. రంధ్రాలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిస్తే జాగ లేకుండా పోతుంది. బాత్రూంకు పైకప్పు వేయలేదు. అడిగితే మాకు సంబంధం లేదని వెళ్లిపోయారు.

- మడావి రమాబాయి, ఎనోలి కొలాంగూడ

మేమే పని చేసుకున్నాం



మా గ్రామంలో 14 ఇళ్లు నిర్మిస్తున్నారు. కూలీల కోసం 14 ఇళ్లకు ఇంటికి ఒక్కరు చొప్పున వెళ్లి పని చేస్తున్నాం. పెద్దలు వ్యవసాయ పనులకు వెళ్తే చిన్నారులు కూడా పనికి వెళ్తున్నారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత రూ.3 వేల చొప్పున చెల్లిస్తామని కాంట్రాక్టర్ చెప్పాడు.

- ఆత్రం చిన్ను, బుగ్గరామన్న గూడెం

ఆదివాసీ సంప్రదాయాలు గొప్పవి



పూజలు చేస్తున్న ఎంపీ సోయం బాపూరావు

జైనూర్(ఆసిఫాబాద్): ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండలంలోని జంగాం దీక్షాభూమిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర పుష్యమాసాన్ని పురస్కరించుకుని జైజంగో.. జైలింగో దీక్షాభూమికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆయన వెంట దీక్ష గురువు కుమ్ర భగవంత్‌రావు, సంస్థాన్ అధ్యక్షుడు ఆత్రం రఘునాథ్, ప్రధాన కార్యదర్శి గేడం జగ్జీవన్, కార్యదర్శి ఆత్రం భగవంత్‌రావు, ప్రచార కార్యదర్శులు మోహన్, మోహపత్, ఆత్రం దత్తు తదితరులు ఉన్నారు.

శివాజీ ఆశయ సాధనకు కృషి



శివాజీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే, తదితరులు

సిర్పూర్(టి): ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని నవేగాంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ అందిస్తుందన్నారు. అంతకు ముందు గోవింద్‌పూర్ కాలనీలోని శివాజీ విగ్రహం నుంచి డొనల్, పేట్‌మహెలా, బస్టాండ్, రైల్వే కాలనీల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు.

గంజాయి స్మగ్లింగ్ అరికట్టాలి

ఆసిఫాబాద్: జిల్లాలో గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, ప్రధాన కార్యదర్శి గొడిసెల కార్తిక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి స్మగ్లింగ్ జరుగుతుందన్నారు. కొంతమంది మహారాష్ట్ర, పొరుగు జిల్లాల నుంచి రవాణా చేసి స్థానికంగా విక్రయిస్తున్నారని అన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు దుర్గం రాజ్‌కుమార్, పురుషోత్తం పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను ప్రతిఘటిద్దాం

- సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు



మాట్లాడుతున్న సాయిబాబు

కాగజ్‌నగర్‌రూరల్: బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు అన్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ ఎదురుగా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక అదాని ఒకరోజు సంపాదన రూ.1600 కోట్లు కాగా, సామాన్య కార్మికుడి ఒకరోజు వేతనం రూ.260 అన్నారు. కార్మికులు సృష్టించిన సంపద కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తుందన్నారు. ఇప్పటికే 450 రైల్వేస్టేషన్లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని ఆరోపించారు. కార్మికులకు కనీస పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మొదటిసారి రైతులు, కార్మికులు కలిసి ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కుమురం భీం స్ఫూర్తితో సమ్మె విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు మధు, వంగూరి రాములు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాదవ్ రాజేందర్, ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు త్రివేణి, నాయకులు శ్రీకాంత్, కృష్ణమాచారి, మొరేశ్వర్, శ్యాంరావు, ప్రభాకర్, అంకన్న, శంకర్, సంజీవ్, మాయ, రూప, వనిత, పద్మ, స్వరూప, కార్తీక్, చాపిలె సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబుకు ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు వినతిపత్రం అందించారు.

'కుష్ఠు'పై సమరం

- జిల్లాలో 69 మంది వ్యాధిగ్రస్తులు
- రేపటితో ముగియనున్న జాతీయ కుష్ఠు పక్షోత్సవాలు
- వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన



బెజ్జూర్ మండలం పెద్దసిద్దాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో కుష్ఠు చాపకిందనీరులా విస్తరిస్తోంది. సకాలంలో వ్యాధిని నిర్ధారించకపోవడంతో బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. వ్యాధి విస్తరణను అడ్డుకునేందుకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జాతీయ కుష్ఠు వ్యాధి పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. గత సర్వేలో గుర్తించిన రోగులకు చికిత్స అందిస్తూనే వ్యాధిని విస్తరించకుండా అడ్డుకునేందుకు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్మూలనకు లెప్రసీ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోంది. జిల్లాలోనే కాగజ్‌నగర్ పీహెచ్‌సీలో మాత్రమే కుష్ఠు వ్యాధి నివారణ విభాగం ఉంది. గురు, శుక్రవారాల్లో లెప్రసీ సొసైటీ ఆధ్వర్యంలో బాధితులకు చికిత్స అందిస్తున్నారు. మిగిలిన రోజుల్లో ఆశ కార్యకర్తలు సర్వే చేపడుతున్నారు. బాధితులను గుర్తించిన తర్వాత వీరికి మందులు జిల్లా కేంద్రం నుంచి పీహెచ్‌సీకి పంపిస్తారు. అక్కడి నుంచి ఆరోగ్య ఉప కేంద్రానికి సరఫరా అవుతాయి. ఆ తర్వాత ఆశ కార్యకర్తలు మందులను బాధితుడికి అందజేస్తారు. వ్యాధిగ్రస్తుడి స్థితిని ఎప్పటికప్పుడు పీహెచ్‌సీ వైద్యాధికారికి సమాచారం అందిస్తారు. బాధితుడికి వైకల్యం ఏర్పడే అవకాశం ఉన్న సందర్భాల్లో ఫిజియోథెరపిస్ట్ చికిత్స అందిస్తారు.

వ్యాధి తీవ్రత.. చికిత్స

జిల్లాలో గత రెండేళ్లలో 69 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించారు. బెజ్జూర్, సిర్పూర్(టి), వాంకిడి, దహెగాం మండలాల్లో ఎక్కువ మంది బాధితులు ఉన్నారు. కుష్ఠు వ్యాధి కారకమైన మైక్రో బ్యాక్టిరియం లెప్రే శరీరంలోకి ప్రవేశించిన ఐదు నుంచి ఏడేళ్ల పాటు ఇంక్యుబేషన్ పీరియడ్ ఉంటుంది. దీంతో ఈ వ్యాధి లక్షణాలు వెంటనే బయటికి రావు. తీవ్రతను బట్టి 6 నుంచి 12 నెలల్లో పూర్తిగా నయం చేసుకోవచ్చు. కుష్ఠులో పీబీ(పాసిబాసిల్లరి), ఎంబీ(మల్టీబాసిల్లరి)గా కేసులు ఉంటాయి. పీబీ అంటే అనుమానిత వ్యక్తి శరీరంపై దద్దులు, రాగి వర్ణపు మచ్చలు, అవయవాల్లో స్పర్శ తక్కువగా ఉండడంతో పాటు ఇతర లక్షణాలతో వ్యాధి తీవ్రత తక్కువగా ఉంటుంది. ఎంబీ కేసుల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. కుష్ఠువ్యాధి బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ)తో పూర్తిగా నయమవుతుంది. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం, వ్యాధి సోకిన వారికి పూర్తి ఎండీటీ చేయించటం ద్వారా అరికట్టవచ్చు. ఎండీటీ చిక్సిత అన్ని ఆస్పత్రుల్లో ఉచితంగా లభిస్తుంది. తక్కువ తీవ్రత ఉంటే 6 నెలలు, ఎక్కువ తీవ్రత ఉంటే 12 నెలల పాటు మందులు వాడాలి. ప్రారంభ దశలోనే గుర్తిస్తే అంగవైకల్యాన్ని కూడా నివారించవచ్చు. చర్మంపై పాలిపోయిన, గోధుమ, రాగి రంగు మచ్చలుండటం, కనుబొమ్మల వెంట్రుకలు రాలడం, చేతి వేళ్లు స్పర్శ కోల్పోయి వంకరపోవడం వంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని కుష్ఠువ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నాం. వ్యాధి నిర్మూలనకు 15 రోజులపాటు కుష్ఠు నివారణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సదస్సులు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపడుతున్నాం. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. లక్షణాలున్న వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంప్రదించాలి. మందులు అందుబాటులో ఉన్నాయి.

- సుధాకర్‌నాయక్, కుష్ఠు ప్రోగ్రాం జిల్లా అధికారి

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం





కెరమెరి మండలం అనార్‌పల్లిలో ఆదివారం శ్రీనివాసుడి కల్యాణోత్సవం వైభవంగా సాగింది. శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అనార్‌పల్లి గోవిందా నామస్మరణతో మార్మోగింది. ఆలయ కార్యదర్శి జాదవ్ కిష్టు నాయక్ ఆధ్వర్యంలో అర్చకులు దామోదర్, శ్రీనివాసచారి, సంతోష్‌శర్మ బృందం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో కల్యాణ క్రతువు నిర్వహించింది. ఈ వేడుకలకు గిరిజన పల్లెల నుంచి భక్తజనం తరలివచ్చారు. ముందుగా వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, పద్మావతిదేవి ప్రతిమలకు అభిషేకాలు చేశారు. తిరుమల, తిరుపతి దేవస్థానం నుంచి ధర్మ ప్రచారకులు ఏడుకొండలు, ఆకుల కుష్వరేశ్వర్ పట్టువస్త్రాలు, అక్షింతలు, కుంకుమ, కంకణం తీసుకువచ్చారు. సాయంత్రం రథం ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. భక్తులు భోగ్ భండార్ పూజల్లో పాల్గొని నృత్యాలు చేశారు.

- కెరమెరి

'కార్పొరేట్‌కు దోచిపెడుతున్న కేంద్రం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్ర ప్రభుత్వం దేశసంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆరోపించారు. ఈ నెల 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆదివారం మండల కేంద్రంలోని ఫారెస్టు నర్సరీలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో కార్మిక, కర్షకులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. బీజేపీ హయాంలో నిరుద్యోగం గరిష్ట స్థాయికి చేరిందన్నారు. కార్మికుల వేతనాలు 20 శాతం తగ్గిపోయాయని అన్నారు. అసంఘటిత కార్మిక వర్గానికి సామాజిక భద్రత చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఫారెస్ట్ నర్సరీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర, నాయకులు సతీష్, ప్రియాంక, బాపు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరిపై కేసు

మందమర్రిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి చెప్పులదండ వేసి ఉన్న ఫొటోను వాట్సాప్ గ్రూప్‌ల్లో షేర్ చేసిన పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బెల్లం అశోక్, వికాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైన ఇతరులను అవమానించినా, రెండు వర్గాలు, పార్టీలను రెచ్చగొట్టేలా ప్రకటనలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బెల్లంపల్లి: ప్రమాదవశాత్తు ఓ స్కూటీ కిందపడిపోయి మంటలు వ్యాపించిన ఘటన ఆదివారం బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. వన్‌టౌన్‌లో పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్ తిరుమలకు చెందిన స్కూటీని ఆమె బంధువులు తీసుకుని సోమగూడెం నుంచి బెల్లంపల్లి వైపు వస్తున్నారు. మార్గమధ్యలో బైపాస్ రోడ్డు వద్ద స్కూటీ ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. ఇద్దరు అల్లంత దూరానపడిపోగా స్కూటీ నుంచి పెట్రోల్ లీకై మంటలు అంటుకున్నాయి. దీంతో సదరు వ్యక్తులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. స్కూటీ పాక్షికంగా దగ్ధమైంది.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


కౌటాల: మండలంలోని బోదంపల్లికి చెందిన యువకుడు కొండ స్వామి(22) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కొండ విజయ్– పవిత్ర దంపతుల పెద్ద కుమారుడు స్వామి గత కొంత కాలం మద్యానికి బానిసయ్యాడు. నిత్యం ఇంట్లో గొడవలు చేసేవాడు. శనివారం విజయ్ పనికి వెళ్లగా..తల్లి పవిత్ర చిన్న కుమార్తెతో ఆసిఫాబాద్‌లో ఉంటున్న హాస్టల్‌లోని చిన్నకుమారుడిని చూడడానికి వెళ్లారు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం సాయంత్రం స్వామి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించగా.. మెరుగైన వైద్యం కోసం పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తల్లి పవిత్ర ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



అమ్మవార్లకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

కోటపల్లి: మండలంలోని ఎదులబంధంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సంప్రదాయాల ప్రకారం ముత్యాలమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు ముత్యాలమ్మతోపాటు లక్ష్మీదేవర, మధునపోచమ్మ అమ్మవార్లకు పార్‌పల్లిలోని ఉత్తరవాహిని గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు భక్తులు కాలినడకన వచ్చారు. పుణ్యస్నానాలు తర్వాత అమ్మవార్లకు గిరిజనులు పూజలు చేశారు. తర్వాత గ్రామానికి చేరుకున్న అమ్మవార్లకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. సాయంత్రం మధునపోచమ్మకు బోనాలు సమర్పించారు. సోమవారం లక్ష్మీదేవర బోనాలు, ముత్యలమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు పూజారి జేక లచ్చయ్య తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించినట్లు ఎంపీటీసీ జేక శేఖర్ పేర్కొన్నారు.



భక్తులపై గోదావరి జలాలు చల్లుతూ..



కోనేరు బావి నుంచి పవిత్ర జలం తీసుకువస్తున్న కొత్త కోడళ్లు, అల్లుళ్లు



భాన్‌దేవత ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు



రంగుల రాట్నాల వద్ద యువతీ, యువకుల సందడి

ఘనంగా పెర్సపేన్ పూజలు



పెర్సపేన్ పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్‌లో మహాపూజతో నాగోబా జాతర ప్రారంభించిన మెస్రం వంశీయులు పెర్సపేన్, భాన్ దేవతల పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోవడ్ నుంచి సంప్రదాయ వాయిద్యాలతో భాన్ దేవత ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. బేటింగ్ అయిన కొత్త కోడళ్లు కోనేరు వద్దకు వెళ్లి పవిత్ర జలం తీసుకురాగా.. మెస్రం వంశం అల్లుళ్లు ఆలయం ఎదుట పాత పుట్టలను తొలగించారు. ఆడపడుచులు, మహిళలు పవిత్ర జలంతో కొత్త పుట్టలను తయారు చేయడంతోపాటు భాన్ దేవతలను శుద్ధి చేశారు. తర్వాత మెస్రం వంశీయులు నాలుగు సగల పెర్సపేన్(పెద్ద దేవుల)ను కొలిచారు. గోదావరి నుంచి తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంతో శుద్ధిచేసి మొక్కుకున్నారు. ఇందులో మెస్రం వంశం పురుషులు పాల్గొన్నారు. నెల 13న గోవడ్ ముఖద్వార వద్ద బేతల్ పూజలు చేసి మెస్రం వంశీయుల ముగించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

నాగోబా చరిత్ర, 22 కితల బోధన

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులకు సంప్రదాయ వంటకాలతో సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ప్రధాన్ కితకు చెందిన మెస్రం గంగారం ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ కొత్త కోడళ్లు, మెస్రం వంశం మహిళలకు నాగోబా చరిత్ర, 22 కితలను బోధించారు. మెస్రం వంశీయులకు కానుకలు అందజేశారు. మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి, మెస్రం రామ తదితరులు ఉన్నారు.



భాన్,పేర్సపేన్ పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



కోనేరు బావి నుంచి పవిత్ర జలం సేకరిస్తున్న బేటి కోడళ్లు



పుట్ట వద్ద పూజలు చేస్తూ..



పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

కొనసాగుతున్న జాతర



క్యూలో భక్తులు

నాగోబా జాతర కొనసాగుతోంది. ఆదివారం ఉమ్మడి జిల్లా నుంచే కాక తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. నాగోబా ఆలయంలో పూజలు చేశారు. పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి దుర్గే గణేశ్ నాగోబా ఆలయంలో పూజలు చేశారు. మెస్రం వంశీయులు ఆయన్ను సన్మానించి నాగోబా ప్రతిమ అందించారు. జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాల వద్ద చిన్నారులతో సందడిగా మారింది.



నాగోబాకు మొక్కుతున్న యువతులు

షిఫ్ట్ మార్చారని కార్మికుడి ఆత్మహత్యాయత్నం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్‌ఆర్‌పీ–1 గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న కొట్టె వెంకటేశ్ అనే కార్మికుడు తన షిఫ్ట్ మార్చారని మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తోటికార్మికులు తెలిపిన వివరాలు.. వెంకటేశ్ గత కొన్నేళ్లుగా ఇంజినీరింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో అతడిని యాజమాన్యం కొన్నిరోజుల క్రితం షిఫ్ట్‌లోకి మార్చింది. దీంతో అతడు మనస్తాపం చెంది ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని తన నివాసంలో ఆదివారం పురుగుల మందు తాగాడు. మిత్రుడు వెంకటేశ్‌కి ఫోన్ చేయగా స్విచ్చాప్ రావడంతో వచ్చి చూసేసరికి అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే అతడిని మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్‌ని ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు పరామర్శించారు.

‘ఏఐటీయూసీపై అసత్యపు ప్రచారాన్ని ఖండిస్తున్నాం’

వెంకటేశ్ ఆత్మాహత్యాయత్నానికి తమ సంఘం కారణమని ఐఎన్‌టీయూసీ నాయకులు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని ఖండిస్తున్నామని శ్రీరాంపూర్ బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఎస్‌ఆర్‌పీ–1 ఫిట్ సెక్రెటరీ దాడి రాజయ్య తెలిపారు. ఆదివారం సీసీసీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఎస్‌ఆర్‌పీ–1 గనిలోని ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సుమారు 15 మంది కార్మికులను యాజమాన్యం షిఫ్టులకు బదిలీ చేసిందని, అందులో కొట్టె వెంకటేశ్‌ని బదిలీ చేసిందన్నారు. అతని ఆత్మహత్యాయత్నానికి తమ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి స్వామి, నాయకులు అనంతరెడ్డి, ప్రకాశ్‌రావు, ఓదెలు, వంశీ, శీను, అక్బర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వెంకటేశ్‌ని పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

నేడు నాగోబా దర్బార్

- ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా కేస్లాపూర్‌లోని ఆలయంలో నేడు దర్బార్ నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలోని హాల్‌లో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిపుత్రులు భారీగా పాల్గొననున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు ఎంపీ సోయం బాపూరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, తదితరులు హాజరుకానున్నట్లు ఈవో రాజమౌళి తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలపై ఆదివాసీలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

దర్బార్ చరిత్ర ఇది..

జాతరలో భాగంగా నిర్వహించే దర్బార్‌కు ప్రత్యేక చరిత్ర ఉంది. జల్.. జంగల్.. జమీన్ నినాదంతో నిజాం సర్కార్‌తో పోరాడిన కుమురంభీం 1940లో అమరుడయ్యారు. భీమ్ పోరాటానికి ఉలిక్కిపడ్డ నిజాం సర్కార్ ఆదివాసీ గిరిజనుల సమస్యలపై అధ్యయనం చేసేందుకు ప్రొఫెసర్ హైమాన్‌డార్ఫ్‌ను ఇక్కడికి పంపించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన ఆయన జైనూర్ మండలం మార్లవాయిని ఎంచుకొని అక్కడే ఉంటూ ఆదివాసీ గిరిజన గ్రామాలను సందర్శించారు. ఈ క్రమంలో 1946లో కేస్లాపూర్ చేరుకున్నారు. మెస్రం వంశీయులు పుష్యమాసంలో నిర్వహించే నాగోబా జాతర విషయం తెలుసుకొని వారితో కలిసి పూజలు చేశారు. వారం పాటు అక్కడే ఉండి వారి సమస్యలు తెలుసుకున్నారు. నాగోబా దర్బార్ పేరుతో సమావేశమై ఆక్వామే కదీం(ఆదివాసీ సంక్షేమ శాఖ కమిటీ)ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా దర్బార్ నిర్వహిస్తూ ఆదివాసీల సమస్యలు, స్థితిగతులు తెలుసుకునేవారు. 1981 ఇంద్రవెల్లి ఘటన తరువాత 1983 నుంచి ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ దర్బార్‌ను నిర్వహిస్తోంది. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తోంది.



సమావేశానికి ముస్తాబైన నాగోబా దర్బార్ హాల్

బాలిక కిడ్నాప్ కలకలం



సుమిత్రను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో ఆరేళ్ల బాలిక కిడ్నాప్‌కు యత్నించిన ఘటన ఆదివారం కలకలం రేపింది. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన అశ్విని–మహేశ్ దంపతులు అదితి(6) కుమార్తెతో కలిసి శనివారం జిల్లా కేంద్రంలోని ఏసీసీ వద్ద నివాసం ఉంటున్న బంధువు సాయిప్రకాశ్ ఇంట్లో సమ్మక్క పూజకు వచ్చారు. ఆదివారం శ్రీనివాస్ గార్డెన్ సమీపంలో అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ చూసేందుకు అందరూ కలిసివెళ్లారు. అపార్ట్‌మెంట్ వద్ద అదితి ఆడుతుండగా దేవాపూర్‌కు చెందిన సుమిత్ర తీసుకెళ్తుండగా కొంత దూరం వెళ్లాక ఏడ్చింది. సుమిత్ర ప్రవర్తనపై స్థానికులకు అనుమానం వచ్చి చితకబాది స్తంభానికి కట్టేశారు. పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని సుమిత్రను స్టేషన్‌కు తరలించారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. సుమిత్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, గత రెండు నెలల నుంచి శ్రీనివాసగార్డెన్ వద్ద అద్దె ఇంట్లో ఒంటరిగా సుమిత్ర ఉండి కూలి పనిచేస్తున్నట్లు తెలిసింది.



కుటుంబ సభ్యులతో అదితి

ప్రశాంతంగా గురుకుల సెట్

జిల్లాల వారీగా వివరాలు

జిల్లా	పరీక్ష కేంద్రాలు	విద్యార్థుల సంఖ్య	హాజరైన వారు
ఆదిలాబాద్	08	2,727	2,628
కుమురం భీం	09	2,782	2,637
మంచిర్యాల	08	3,335	3,157
మొత్తం	25	8,844	8,422

బెల్లంపల్లి: తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీసెట్) ఆదివారం ఆదిలాబాద్ రీజియన్‌లో ప్రశాంతంగా జరిగింది. 2024–25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాలు, మహాత్మా జ్యోతిబాపూలే (బీసీ సంక్షేమ), గిరిజన సంక్షేమ, ప్రభుత్వ గురుకుల (టీఎస్‌ఆర్‌ఎస్) విద్యాలయాలు ఉమ్మడిగా ప్రవేశపరీక్ష నిర్వహించాయి. రీజియన్ పరిధి ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల జిల్లాల్లో 8,844 మంది విద్యార్థులు ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 8,422 మంది హాజరుతో 95.23 శాతం నమోదైంది. మరో 422 మంది గైర్హాజరైనట్లు ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ స్వరూపరాణి తెలిపారు. రీజియన్ వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



బెల్లంపల్లిలోని కేంద్రంలోకి వెళ్తున్న ఓ విద్యార్థి

కేంద్రాలకు గంట ముందుగానే..

ప్రవేశపరీక్ష ఉదయం 11 గంటలకు ఉండగా తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి విద్యార్థులు కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. వారిని పరీక్షించి లోనికి పంపించారు. పరీక్ష హాల్‌లో ఓఎంఆర్ షీట్ బబ్లింగ్‌పై అవగాహన కల్పించి, 11 గంటలకు ప్రశ్నాపత్రాన్ని అందజేశారు. మధ్యాహ్నం 1 గంటకు పరీక్ష ముగిసింది. కాగా, పరీక్ష కేంద్రాల్లో ఎండతీవ్రత దృష్టిలో పెట్టుకుని కుండలు, రంజన్లలో తాగునీటిని అందుబాటులో ఉంచారు. ముందస్తుగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాల సందర్శన

బెల్లంపల్లిలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను గిరిజన సంక్షేమ గురుకుల అసిస్టెంట్ సెక్రెటరీ జీఎం, ప్రత్యేక పరిశీలకుడు వెంకటేశం, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ సందర్శించారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని ఏర్పాటుచేసిన సీఓఈ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఐనాల సైదులు, ఇతర చీఫ్ సూపరింటెండెంట్లను వెంకటేశం అభినందించారు.

కాలువలపై అక్రమ నిర్మాణాలు

మందమర్రిరూరల్: మున్సిపాలిటీలోని మార్కెట్ ఏరియాలో లక్షలాది రూపాయలతో నిర్మించిన కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. కాలువలపై షాపుల యజమానులు నిర్మాణాలు చేపట్టడంతో రోడ్డు చిన్నగా మారింది. దీంతో వర్షపు నీరు రోడ్డుపై పారుతోంది. అంతేకాకుండా షాపుల పైనుంచి విద్యుత్ లైన్ ఉండగా యజమానులు అధికారులతో మిలాఖత్ అయి విద్యుత్ తీగలు మరింత రోడ్డు వైపునకు జరిపి ప్రమాదకరంగా వేయించడం గమనార్హం. మార్కెట్ ఏరియాలో కొన్నిమాల్స్ ఏర్పాటు చేసినా వాటి ముందు వాహనాలు నిలపడానికి చోటు లేకనే రోడ్డుపై నిలుపుతున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులకు మరింత ఇబ్బందికరంగా మారింది. మున్సిపల్ అధికారులు స్పందించి నిర్మాణాలు తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బెజ్జూర్ అడవులకు ట్రెయినీ ఎఫ్‌ఎస్‌వోలు

బెజ్జూర్: దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ట్రెయినీ ఎఫ్‌ఎస్‌వోలు ఆదివారం బెజ్జూర్ మండలంలోని అడవులను సందర్శించారు. రేంజ్ పరిధిలోని ఇందిరిగాంలో గడ్డి మైదానాలు, రాముడు భీముడు వృక్షాలు, టేక్ ప్లాంటేషన్ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. అడవుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, అటవీ సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి దయాకర్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్‌కుమార్, బీట్ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.